సాక్షి ప్రకాశం

బుధవారం : 29 మార్చి 2023



క్షణికావేశం.. తీరని శోకం

భార్యభర్తల మధ్య వచ్చిన చిన్న తగాదా నేపథ్యంలో భార్యపై భర్త దాడిచేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. అనంతరం భర్త కూడా ఆత్మహత్య చేసుకున్నాడు.

- 8లో..



తెల్లవారు జామున చోరీ

మద్దిపాడులోని ఓ ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున దొంగలు చొరబడి 15 సవర్ల బంగారం దోచుకెళ్లారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

ఇఫ్తార్ : సా. 06:27 ని.
బుధవారం

సహర్ : ఉ. 04:46 ని.
గురువారం

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్



విశాఖపట్నంలో జరుగుతున్న జీ20 సమ్మిట్‌కు మంగళవారం హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం



టీకాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల టౌన్: అన్నదాతలతో పాటు పాడిరైతులు ఆర్థికంగా వృద్ధి చెందేలా సంక్షేమ పథకాలు అందించి పశువుల సంపూర్ణ ఆరోగ్యానికి భద్రత కల్పిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం పశువైద్యశాలలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యురాలు పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటుగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, చీరాల ఏడీ డాక్టర్ చిట్టిబాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సునీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల సంరక్షణ కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, పశువులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు 1962 సంచార వైద్యశాల, రాయితీపై పథకాలు అందిస్తుందన్నారు. పాడి పశువులకు సీజనల్ వ్యాధులకు గురికాకుండా టీకాలు, పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. అనంతరం గాలికుంటు టీకాలను పాడిపశువులకు పశువైద్యులు వేశారు. ఏప్రిల్ 24 తేదీ వరకు జరిగే టీకాల పంపిణీలో పశుపోషకులు విధిగా తమ పశువులు, గేదెలకు గాలికుంటు రాకుండా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీలు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో బీజేపీ కన్వీనర్ల నియామకం

ఒంగోలు: ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కన్వీనర్లను నియమిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు-యానం చిన యోగయ్య యాదవ్, మార్కాపురం-ఎంపీ కృష్ణారావు, వై.పాలెం-సింగా ప్రసాద్, గిద్దలూరు- మంచాల బ్రహ్మేశ్వర ప్రసాద్, కొండపి-మిడసల బాలకోటయ్య, కనిగిరి- కొండిశెట్టి రామయ్య, దర్శి-ఎంశ్రీనివాసరావులను నియమించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఏప్రిల్ 2న పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్థానిక భారతీయ వ్యాయామ కళాశాలలో ఏప్రిల్ 2న పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గుంటి భక్తధ్రువుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ (అండర్ 18), జూనియర్స్ (అండర్ 23), మాస్టర్స్ (40 సంవత్సరాల పైబడిన వారు) ఈ ఎంపికలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏప్రిల్ 23, 24 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు సెల్: 8142555000 లేదా 9885721140 నంబర్లను సంప్రదించాలన్నారు.



సిరులు పట్టు

పట్టుసాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. రెండేళ్లుగా చైనా నుంచి పట్టు దిగుమతులు లేకపోవడంతో దేశీయంగా పట్టుకు డిమాండ్ పెరిగింది. ఫలితంగా పట్టుగూళ్ల ధరలు రెట్టింపయ్యాయి. పెరిగిన ధరల్లో నిలకడతో పాటు.. రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుండటంతో పట్టుసాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పట్టుసాగుపై ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

- లాభదాయకంగా పట్టుసాగు
- నానాటికీ పెరుగుతున్న మల్బరీ సాగు విస్తీర్ణం
- భారీగా పెరిగిన పట్టుగూళ్ల ధరలు
- రూ.300 నుంచి రూ.700కి పెరిగిన ధర
- జిల్లాలో 2,600 ఎకరాల్లో పట్టుసాగు
- షెడ్లు, పరికరాలకు సబ్సిడీ రుణాలు

బేస్తవారిపేట: సాంప్రదాయ పంటలతో పాటు మల్బరీ సాగు అధిక ఆదాయమిస్తోంది. గతంలో సక్రమంగా వర్షాలు లేకపోవడం, సరైన మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. నేడు పుష్కలంగా భూగర్భజలాలు ఉండటం, సకాలంలో వర్షాలు పడుతుండటంతోపాటు పట్టుగూళ్లకు మంచి ధర ఉండటంతో మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

చైనా నుంచి దిగుమతి లేకపోవడంతో...

పట్టు ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా మొదటి స్థానంలో నిలవగా, భారత్ రెండో స్థానంలో ఉంది. ఇక్కడ పట్టు ఉత్పత్తి జరుగుతున్నా వినియోగం ఎక్కువగా ఉండటంతో, పట్టును దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండ్ దేశాల నుంచి కూడా పట్టును దిగుమతి చేసుకునేవాళ్లం. మన దేశంలో ఏటా 45 వేల టన్నుల పట్టు అవసరం కాగా, 31 వేల టన్నులు మాత్రమే ఇక్కడ ఉత్పత్తి అవుతోంది, మిగిలినది ఎక్కువగా చైనా నుంచి 10 వేల టన్నుల పట్టు దిగుమతి చేసుకునేవాళ్లం. రెండేళ్లుగా చైనా నుంచి పట్టు దిగుమతి చేసుకోకపోవడంతో మన దేశంలో పట్టుకు మంచి డిమాండ్ ఏర్పడింది.

జిల్లాలో 2600 ఎకరాల్లో పట్టుసాగు చేస్తున్నారు. బేస్తవారిపేట, గిద్దలూరు సాంకేతిక సేవా కేంద్రాల పరిధిలో 920 ఎకరాల్లో, దోర్నాల, మార్కాపురం టీఎస్‌సీ పరిధిలో 500 ఎకరాలు, ఒంగోలు, కందుకూరు పరిధిలో 1200 ఎకరాల్లో పంట సాగులో ఉంది. ప్రభుత్వం పట్టు సాగుకు ప్రోత్సాహకాలు బాగా ఇస్తుండటంతో అధిక సంఖ్యలో రైతులు సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు. 25 రోజుల పంట కావడంతో ఏడాదిలో ఏడు, ఎనిమిది పంటలు తీసుకుంటున్నారు.

ఏడాదిన్నరగా నిలకడగా అధిక ధర...

గతంలో మార్కెట్‌లో బైఓల్టేన్ పట్టుగూళ్లు కేజీ రూ.300 ధర ఉండగా నేడు రూ.650- రూ.700 ధర పలుకుతోంది. రెండేళ్లుగా ధరలు పెరుగుతున్నాయి కానీ తగ్గడంలేదు. దీంతో రైతులు పట్టుసాగుపై ఆసక్తి చూపుతున్నారు.



చంద్రికల్లో పట్టు గూళ్లు

సిల్క్ సమగ్ర పథకంలో..

20×50 షెడ్డుకు రూ.3 లక్షల సబ్సిడీ, ఉపాధి హామీ పథకంలో అదనంగా రూ.3 లక్షలు మంజూరు చేస్తున్నారు. మొక్కలకు ఎకరాకు 70 శాతం సబ్సిడీ రూ.18,750, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీ రూ.22,500 ఇస్తున్నారు.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన...

పాత మల్బరీ సాగు రైతులకు 250 చంద్రికలు 50 శాతం సబ్సిడీపై అందిస్తారు. కొత్త రైతులకు రూ.75 వేల యూనిట్‌లో షూట్ స్టాండ్, పరికరాలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ, ఓసీలకు 75 శాతం సబ్సిడీ ఉంటుంది.

కిసాన్ నర్సరీ పథకంలో..

రైతులు మల్బరీ నారు పెంచుకోవడానికి యూనిట్ ధర రూ.1.50 లక్షలు. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ, ఓసీలకు 75 శాతం సబ్సిడీ వర్తిస్తుంది.



షెడ్డులో మల్బరీ ఆకు తింటున్న పట్టు పురుగులు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వైఎస్సార్ పట్టుబడి పథకంలో భాగంగా పట్టుపురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుపై శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మన జిల్లాకు నూతనంగా 30 షెడ్లు మంజూరు కాగా అన్నీ నిర్మాణంలో ఉన్నాయి. వర్షాలు బాగా పడటం, మంచి ధరలు ఉండటంతో రైతులు పట్టుసాగుపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

– ఏ బాల సుబ్రహ్మణ్యం, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదిగి అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలకు మంగళవారం బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కోలాటం ఆడి అందరినీ ఉత్సాహ పరిచారు. వెంకాయమ్మకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికి పూల మాలలతో ఘనంగా సత్కరించారు. పాత పోస్టాఫీసు వద్ద జెడ్పీ నిధులతో నిర్మించిన చేతి పంపును పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జగనన్న చేస్తున్న కృషి మరువలేనిదని అన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారన్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో బలమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం తో పాటు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఒకేషన్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారన్నారు. తాను గతంలో వచ్చినప్పుడు సైకిల్ స్టాండ్, డైనింగ్ హాల్ కావాలని విద్యార్థులు అడిగారని అందులో భాగంగా సైకిల్ స్టాండ్ మంజూరు చేశామని, డైనింగ్ హాల్‌కు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులు మొదలవుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోలాటం ఆడి ఉత్సాహ పరుస్తున్న వెంకాయమ్మ



వేంపాడులో కొండచిలువ కలకలం

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. గ్రామంలోని బీసీ కాలనీలో చెట్ల మధ్యలో నుంచి కొండచిలువ ఇళ్లలోకి వస్తుండగా స్థానికుల కంటపడింది. దీంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎంతసేపటికీ వారు రాకపోవడంతో స్థానిక యువకులు గోతం తెచ్చి అందులో బంధించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఇంతో అది పక్కనే ఉన్న చెట్లలోకి జారుకుంది.

వేంపాడులో ఇళ్లలోకి వస్తున్న కొండచిలువ

రైల్వే మూడో లైన్ పనుల పరిశీలన

- రూ.835 కోట్లతో వెంకటేశ్వరపాలెం-కరవది వరకు 89 కి.మీ లైన్ నిర్మాణం
- పనులు పరిశీలించిన రైల్వే ముఖ్య భద్రతాధికారి సక్సేనా

సింగరాయకొండ: నూతనంగా రూ.835 కోట్లతో వెంకటేశ్వరపాలెం నుంచి కరవది వరకు నిర్మించిన 89 కి.మీ మూడో రైల్వే లైనుతో పాటు అనుబంధంగా నిర్మించిన భవనాలు, సాంకేతిక పరికరాలను మంగళవారం భారతీయ రైల్వే ముఖ్య భద్రతాధికారి ప్రాన్‌జీవ్ సక్సేనా తనిఖీ చేశారు. ఉలవపాడు నుంచి సింగరాయకొండ వరకు నిర్మించిన మూడో రైల్వే ట్రాక్‌ను ట్రాలీపై వచ్చి అణువణువునా పరిశీలించారు. సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన బిల్డింగు, సాంకేతిక పరికరాలను పరిశీలించారు. తరువాత ప్రత్యేక రైలులో సింగరాయకొండ నుంచి ఉలవపాడు వరకు ప్రయాణించి ట్రాక్ సామర్థ్యం, నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం మనుబోలు నుంచి సింగరాయకొండ వరకు 122 కిలోమీటర్ల దూరం మూడో రైల్వే లైను పనులు పూర్తయ్యాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మూడో రైల్వే లైను నిర్మించారని ఈ లైను పై రెండు వైపులా రైళ్లు వెళ్లేలా సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించారన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రాన్‌జీవ్ సక్సేనా మొక్కను నాటారు. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్రమోహన్, డిప్యూటీ రైల్వే ముఖ్య భద్రతాధికారి జీ శ్రీనివాసరావు, సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి నీరజ్ అగర్వాల్, ఈడీ ఎంపీ సింగ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



సింగరాయకొండ రైల్వేస్టేషన్ లో అభివృద్ధి పనులు పాన్‌జీవ్ సక్సేనా, రైల్వే అధికారులు

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి

- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

కురిచేడు: గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కురిచేడు 1వ సచివాలయం పరిధిలో ఆయన మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు సక్రమంగా పనిచేయాలని లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వం చేరువవుతోందని అన్నారు. గ్రామ స్థాయి నాయకులు కూడా ప్రజల సమస్యల పట్ల చొరవచూపాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరసైనికుల్లా అందరూ కలసికట్టుగా పనిచేయాలని, ప్రజల సంక్షేమం కోరే ఇలాంటి ప్రభుత్వాన్ని పదికాలాలపాటు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. పేదరిక నిర్మూలన, నిరక్షరాస్యత నిర్మూలన, ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మోసపు మాటలు చెప్పి, దగా చేసే నాయకులను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనరు షేక్. సైదా, దర్శి ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, వైస్ చైర్మన్ కే నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనరు మేరువ సుబ్బారెడ్డి, కురిచేడు, పడమర గంగవరం, బయ్యవరం, కల్లూరు సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, కాసు భాస్కరరెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ, ఎంపీటీసీలు బుల్లం వెంకటనర్సయ్య, కానాల శివారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ మర్రి సుబ్రహ్మణ్యం, నాయకులు మేరువ పిచ్చిరెడ్డి, ఇందూరి సుబ్బారెడ్డి, బెల్లం చంద్రశేఖర్, షేక్.మస్తాన్‌వలి, కే వెంకటరమణ, మునికర యోగిరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వేమావెంకట నారాయణ, యం కిరణ్ బాబు, వడ్డె మాలకొండయ్య, మాదిరెడ్డి రామకృష్ణారెడ్డి, కండె గంగయ్య, వై వి సుబ్బయ్య, కర్నాటి వెంకటరెడ్డి, చలమయ్య, వరికూటి వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, అంకె కృష్ణ, దాసరి రమేష్, వేమా చిన్న ఆంజనేయులు, గుంటక నాసరరెడ్డి, అందె సుబ్బారెడ్డి, వేమా ఆంజనేయులు, చౌడయ్య, పెద్ద పెద్దయ్య, జక్రయ్య, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ప్రజల జీవన స్థాయి పెరగాలి

- అధికారులు, ఉద్యోగులు ఆత్మసంతృప్తి కలిగేలా పనిచేయాలి
- ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాల మేరకు యంత్రాంగం పనిచేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజల జీవన స్థాయి మెరుగుపడేలా అధికార యంత్రాంగం, ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా శాఖ కార్యదర్శి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జీజీహెచ్ ఆడిటోరియంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధ్యక్షతన ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన (ఎస్‌డీజీ), స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల అమలుపై వర్క్‌షాప్, సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్‌తో పాటు బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్, ప్రకాశం ఎస్పీ మలికాగర్గ్ రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు ఎస్‌డీజీ, స్పందన కార్యక్రమాల అమలు చేస్తున్న తీరును వివరించారు.

దీనిలో ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల సమస్యలు పరిష్కరించినా, చిత్తశుద్ధితో విధులు నిర్వహించినా పేద, బడుగు వర్గాల ప్రజల జీవితాలపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. యంత్రాంగం చేసే పనుల వలన ప్రజలకు మేలు జరిగితే వాళ్ల పేదరికం నుంచి బయటపడతారన్నారు. తద్వారా చేసిన ఉద్యోగులకు ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ 'స్పందన' పేరును నిర్ధారించారని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం పనితీరుకు 'స్పందన' అద్దం పట్టేలా పనిచేయాలన్నారు. జిల్లాల్లో ఎస్ఎల్ఏ లోపు అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాల మేరకు అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. వర్క్‌షాప్ తర్వాత యంత్రాంగం చేసే పనితీరులో మార్పు వచ్చి పేద ప్రజల జీవన స్థాయి మెరుగుపడుతుందని ఆశిస్తున్నానన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పట్ల ప్రతి ఉద్యోగి అవగాహనతో వాటిని సాధించే దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ధనిక, పేదల మధ్య తీవ్రస్థాయిలో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఐక్యరాజ్య సమితి 2015లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఏర్పరచిందన్నారు. పేదరికం, ఆకలి నివారించి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన తాగునీరు అందించడం వంటి 17 లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ప్రభుత్వ రూపొందించిన పథకాలు, కార్యక్రమాల ద్వారా ఈ లక్ష్యాలను సాధించేలా ప్రతి ఉద్యోగి పనిచేయాలన్నారు.



అవగాహన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న జీఎస్ఆర్‌కేఆర్.విజయ కుమార్, కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయక్రిష్ణన్, ఎస్పీ మలికాగర్గ్ తదితరులు



కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి దిశగా చేసిన సూచనలను అధికార యంత్రాంగం అమలు చేసేలా చూస్తామన్నారు. స్పందన సమస్యల పరిష్కారంలోను నాణ్యత ఉండేలా మరింత కృషి చేస్తామని చెప్పారు. ఎస్‌డీజీ సాధనపై ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుని పేదరిక నిర్మూలన, బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.



బాపట్ల కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను సొంత సమస్యలుగా భావించి అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించినప్పుడే అటు అర్జీదారులకు, ఇటు యంత్రాంగానికి ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రాధాన్యతతో పనిచేస్తామన్నారు.



ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ ఎస్‌డీజీ, స్పందన అంశాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంపై ఉద్యోగులు అవగాహన పెంచుకుని పనిచేయాలన్నారు. సిబ్బందిలో జవాబుదారీతనం ఉండాలన్నారు. ప్రతి అర్జీని ప్రాధాన్యతగా తీసుకుని ప్రజలకు సేవలందించాలన్నారు.

అమరావతి నుంచి వచ్చిన పాఠశాల విద్యా కమిషనర్ విజయదుర్గ, మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ సునీత, పురపాలక శాఖ అదనపు డైరెక్టర్ రవీంద్రబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాస్కరరావు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌బాబు, సచివాలయాల ప్రాజెక్టు లీడర్ అశోక్, ఆర్‌టీజీఎస్ ప్రతినిధి సృజన్, బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ శిక్షకులు శ్రీనివాసరావులు ఆయా రంగాల్లో జిల్లాలో జరుగుతున్న ప్రగతిని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, బాపట్ల డీఆర్‌ఓ లక్ష్మీ శివజ్యోతి, ప్రకాశం డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, సీపీవో వెంకటేశ్వర్లు, స్పందన సూపరింటెండెంట్ నాగజ్యోతి పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన అధికారులు, ఉద్యోగులు

క్లుప్తంగా

ముగ్గురు సీఐల బదిలీ

● వీఆర్‌కు ఇద్దరు సీఐలు

ఒంగోలు టౌన్‌: జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్‌ ఐజీ డాక్టర్‌ త్రివిక్రమ్‌వర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాలుకా సీఐ శ్రీనివాసరెడ్డిని రూరల్‌ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇటీవల ఒంగోలు రూరల్‌ సీఐగా స్వల్పకాలం చేసి వీఆర్‌కు వెళ్లిన రామకృష్ణారెడ్డిని కనిగిరి సీఐగా, కనిగిరిలో విధులు నిర్వహిస్తున్న పాపారావును వీఆర్‌కు పంపించారు. ఒంగోలు ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రరావును పొదిలికి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న సుధాకర్‌ను వీఆర్‌కు పంపించారు.

ప్రమాదవశాత్తు మహిళ మృతి?

కనిగిరి రూరల్‌: పట్టణంలోని కొత్తూరులో ఓ మహిళ మృతి చెందింది. ఇంట్లో కుమారులిద్దరూ గొడవ పడుతుండగా సర్దుబాటు చేసే క్రమంలో మహిళ జారి కింద పడింది. తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించగా.. చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ అడగ్గా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు.

ఫస్ట్‌ జాలీ!


పరీక్షలు ముగిసిన ఆనందంలో ఇంటర్‌ ఫస్ట్‌ ఇయర్‌ విద్యార్థులు


స్వగ్రామానికి వెళ్లేందుకు లగేజీతో ఆటో ఎక్కుతున్న విద్యార్థులు


ఇక ఇంటి దారి..


లగేజీ మొత్తం ఆటోలో..

పుస్తకాలతో కుస్తీలు పట్టిన యూత్‌.. పరీక్షలు పూర్తి కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎండాకాలం సెలవుల్లో ఏం చేయాలనే ప్లాన్‌లు వేసుకున్నారు. ఇంటర్‌ సెకండ్‌ ఇయర్‌లో మంచి మార్కులు తెచ్చుకోవాలని ఫిక్స్‌ కూడా అయ్యారు. మంగళవారం ఇంటర్‌మీడియెట్‌ మొదటి సంవత్సం పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులంతా సంతోషంగా ఇళ్ల బాట పట్టారు.

– ఫొటోలు: ఎం. ప్రసాద్‌, సాక్షి ఫొటోగ్రాఫర్‌


త్వరగా ఇంటికెళ్లాలి..


ఇక ఆనందం మీ వంతు

ఇంటర్‌ పరీక్షలకు 1727 మంది గైర్హాజరు

ఒంగోలు: జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్‌ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్‌ పరీక్షలకు 1727 మంది గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని 95 కేంద్రాలలో ఈ పరీక్షలు జరగ్గా, జనరల్‌ విభాగంలో 27360 మందికి 25803 మంది, ఒకేషనల్‌ విభాగంలో 1335 మందికి 1165 మంది హాజరయ్యారు. పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఆర్‌ఐవో ఎ.సైమన్‌ విక్టర్‌ తెలిపారు.


చలో చలో..

క్షణికావేశం.. తీరని శోకం


మార్చురీలో భార్యాభర్తల మృతదేహాలు


బీచ్‌కు కొట్టుకొచ్చిన ఢాకా అంజిరెడ్డి మృతదేహం

● ప్రాణాలు కోల్పోయిన భార్యాభర్తలు
● భార్యపై దాడి చేయడంతో ఆమె మృతి
● అనంతరం మనోవేదనతో సముద్రంలో మునిగి భర్త బలవన్మరణం
● అనాథలుగా మిగిలిన ఇద్దరు కూతుర్లు


భార్య ఢాకా పూర్ణిమ (ఫైల్‌)

ఒంగోలు టౌన్‌/ కొత్తపట్నం: క్షణికావేశం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. భార్యాభర్తల మధ్య కలహాలు ఇద్దరి చిన్నారులను అనాథలుగా చేసింది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఒంగోలు నగరంలోని విరాట్‌ నగర్‌లో డాకా అంజిరెడ్డి (42), పూర్ణిమ (39) నివసిస్తుంటారు. అంజిరెడ్డి ఇంటివద్దే కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా, పూర్ణిమ ఆర్పీగా చేస్తోంది. వీరికి ఇద్దరు కూతుర్లు, భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. సోమవారం రాత్రి ఎప్పటి లాగే వారి మధ్య వివాదం చోటుచేసుకుంది. మాటా మాటా పెరిగింది. క్షణికావేశానికి గురైన అంజిరెడ్డి పక్కనే ఉన్న చపాతి కర్రతో భార్య తలమీద కొట్టాడు. తీవ్ర రక్త స్రావం అవుతుండటంతో భయంతో అక్కడి నుంచి పారిపోయాడు. బంధువుల సహాయంతో ఆమెను వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా ఇంటి నుంచి వెళ్లిపోయిన అంజిరెడ్డి కొత్తపట్నం సముద్రంలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం కె.పల్లెపాలెం తీర ప్రాంతం వద్ద ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఒంగోలు రిమ్స్‌ ఆసుపత్రిలో భార్యాభర్తల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఘటన విరాట్‌ నగర్‌లో విషాదాన్ని నింపింది. తలిదండ్రులు ఇద్దరూ మరణించడంతో కన్నీరుమున్నీరు అవుతున్న వారి కూతుళ్లను ఓదార్చడం కష్టంగా మారింది. మృతుడికి సోదరుడు వరసయ్యే పి.ఆదినారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు ఎస్పీ అభినందనలు

ఒంగోలు టౌన్‌: బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష పడేలా సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసులను ఎస్పీ మలికా గర్గ్‌ అభినందనలు తెలిపారు. 2017 మేలో ఒంగోలులో బాలికపై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో లైంగిక దాడి చేసిన ఘటన తాలుకా పోలీస్టేషన్‌లో నమోదైంది. మంగళవారం ఒంగోలులోని పోక్సో కోర్టు జడ్జి ఎంఏ సోమశేఖర్‌ యావజీవ శిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన అప్పటి ఒంగోలు డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు, జిల్లా పోక్సో కో ఆర్డినేటర్‌ సభ్యులుగా ఉండి కోర్టులో సకాలంలో సాక్ష్యాలను ప్రవేశపెట్టిన దిశ డీఎస్పీ పల్లపురాజు, దిశ ఎస్సై షేక్‌ రజియా సుల్తానా, అప్పటి తాలుకా ఎస్సై ప్రసాద్‌, ఏఎస్సై ఈవి స్వామి, కానిస్టేబుల్‌ ఎం యలమంద, తాలుకా హెడ్‌ కానిస్టేబుల్‌ షేక్‌ సద్దాంలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్‌ మాట్లాడుతూ...చిన్నారులపై అఘాయిత్యాలు, లైంగిక దాడులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలపై లైంగిక దాడులకు పాల్పడే వారు ఎట్టి పరిస్థితుల్లో శిక్ష నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పోక్సో మానిటరింగ్‌ టీమ్‌ ద్వారా సమర్థవంతమైన ట్రయిల్‌ మానిటరింగ్‌ చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

31 నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కంభం: మండలంలోని లింగోజీపల్లిలో ఉపదేశ రామస్వామి 59వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 31 నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదో బహుమతుల కింద రూ. 50 వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. ఏప్రిల్‌ ఒకటిన ఆరుపళ్ల సైజు విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 8179744021 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తెల్లవారు జామున చోరీ


చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అడిషనల్‌ ఎస్పీ శ్రీధర్‌, డీఎస్పీ నాగరాజు, గృహిణి శోభ


పరుగులు తీస్తున్న పోలీస్‌ డాగ్‌

● దోటీతో తలుపులు తెరచిన దుండగులు
● మరో నాలుగు ఇళ్లలో చోరీ యత్నం
● 15 సవర్ల బంగారంతో పరార్‌

మద్దిపాడు: అందరూ ఆదమరచి నిద్రిస్తున్న సమయంలో ఓ దొంగ ఇంటిలో దూరి బంగారు నగలు ఎత్తుకు పోయిన ఘటన మద్దిపాడులో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. మండల కేంద్రం మద్దిపాడు పెట్రోలు బంకు సమీపంలో ఘంటా రాంబాబు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుని జీవిస్తున్నాడు. రాంబాబు అక్క పద్మావతి భర్త చనిపోయిన తరువాత తమ్ముని వద్దనే ఉంటూ పక్కనే ఇంటి నిర్మాణం చేయించుకుంటూ ఇటీవల విశాఖ పట్నం వెళ్లింది. ఈక్రమంలో మంగళవారం తెల్లవారు జామున దొంగ, దోటీతో కిటికీలో నుంచి తలుపు గడియ తొలగించి రాంబాబు నివసిస్తున్న ఇంటిలోనికి ప్రవేశించాడు. ఈక్రమంలో రాంబాబు దంపతులు నిద్రిస్తున్న గదిలో కాకుండా దాని ఎదురు ఉన్నగదిలోకి వెళ్లి (పద్మావతి వాడుకుంటున్న గది) వార్డు రోబ్‌లో ఉన్న చీరలు తొలగిస్తుండగా బంగారు నగలు, చెవిరింగులు, ఉంగరాలు ఉంచే బాక్సులు కనిపిండంతో వాటిని తీసుకున్నాడు. అనంతరం హాలులోకి వచ్చి బంగారం తీసుకుని ఖాళీ బాక్సులు హాలులో ఉన్న సోఫాలో పడవేసి వెళ్లాడు. ఎస్‌ఐ శ్రీరామ్‌ చుట్టు పక్కల ఉన్న వారిని విచారిస్తుండగా సదరు దొంగ మరో ఇంటిలోనికి ప్రవేశించి అక్కడ చెప్పులను వదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని అడిషనల్‌ ఎస్పీ శ్రీధర్‌, డీఎస్పీ యు. నాగరాజు పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించాలని ఎస్‌ఐకి ఆదేశాలు జారీ చేశారు. క్లూస్‌ టీమ్‌ సభ్యులు ఆధారాలు సేకరించారు. పోలీస్‌ డాగ్‌ ఐదు ఇళ్ల వద్ద తిరిగి.. రహదారిపైకి వచ్చింది. మొత్తం 15 సవర్లు బంగారం ఉంటుందని చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. అడిషనల్‌ ఎస్పీ శ్రీధర్‌ మాట్లాడుతూ త్వరలోనే దొంగను పట్టుకుంటామన్నారు.

పోక్సో కేసులో నిందితునికి జీవిత ఖైదు

ఒంగోలు: పోక్సో కేసులో నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్‌ మంగళవారం తీర్పునిచ్చారు. నంద్యాల ప్రతాప్‌రెడ్డి అనే యువకుడు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. తల్లితోపాటు నివాసం ఉండే అతను సమీపంలోని 11 సంవత్సరాల బాలికను బలవంతంగా ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఇంటికి వెళుతుండగా సమీపంలోని వారు బాలికను చూసి పుష్పవతి అయిందని భావించారు. కానీ కొద్దిసేపటికే బాలిక ద్వారా అసలు విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హతాశులై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన అప్పటి డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు కేసు నమోదుచేసి, కోర్టులో చార్జిషీటు వేశారు. 2017లో జరిగిన ఈ ఘటనలో నిందితుడు ప్రతాప్‌రెడ్డిపై నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్‌ నిందితునికి జీవితఖైదు (బతికినంత కాలం జైలులో) అనుభవించాలని, దాంతో పాటు రూ. 2వేల జరిమానా విధించారు. దీంతోపాటు బాధిత బాలికకు నష్టపరిహారం కింద ప్రభుత్వం రూ. 7.50 లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా కేవీ రామేశ్వరరెడ్డి వాదించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల నాణ్యత భేష్‌

● గృహ నిర్మాణ సంస్థ క్వాలిటీ సెల్‌ ఎస్‌ఈ రామచంద్రన్‌


ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రామచంద్రన్‌

మార్కాపురం: జగనన్న ఇళ్ల నిర్మాణాల నాణ్యత బాగుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ విజిలెన్స్‌ అండ్‌ క్వాలిటీ కంట్రోల్‌ సెల్‌ సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ కె.రామచంద్రన్‌ అన్నారు. మార్కాపురం పట్టణ శివారులోని ఇడుపూరు లేఔట్‌, పొదిలిలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాల నాణ్యతను మంగళవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని, లబ్ధిదారులు క్యూరింగ్‌ బాగా పెట్టుకోవాలని సూచించారు. దాదాపు 1300 గృహాలు నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. కొంతమంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, వారి వివరాలను ఆప్షన్‌–3గా రికార్డు చేశామని, ప్రభుత్వమే వారి ఇళ్ల నిర్మాణాల బాధ్యత తీసుకుంటుందన్నారు. ఇటువంటి ప్రక్రియ కార్పొరేషన్‌ చరిత్రలో లేదని చెప్పారు. మొదటిసారిగా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. లబ్ధిదారులు తమకు ఇష్టమైన మేస్త్రీ లేదా కాంట్రాక్టర్‌ను మాట్లాడుకొని వారి ద్వారా ప్రభుత్వం ఇచ్చే మెటీరియల్‌ను తీసుకొని వారికి ఇచ్చి వాళ్ల ద్వారా నిర్మాణం చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి నాణ్యతలో అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కొత్తగా 36 క్వాలిటీ ల్యాబ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామని, వీటి ద్వారా ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించవచ్చని చెప్పారు. ఈయన వెంట ఈఈలు భాస్కర్‌, వెంకటస్వామి, డీఈ పవన్‌కుమార్‌, సిబ్బంది ఉన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి


మృతుడు లక్ష్మీనారాయణ

బల్లికురవ: మద్యం మత్తు, ఎండతాపానికి గురై రోడ్డు మార్జిన్‌లోనే పడిపోయి యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కొత్తమల్లాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై వి.వేమన వివరాల మేరకు.. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ (35) ఇక్కడ క్వారీల్లో పనిచేస్తున్నాడు. సంతమాగులూరుకు చెందిన కాంట్రాక్టర్‌ సత్యం ద్వారా వచ్చాడు. మద్యానికి బానిస కావడంతో ఏ క్వారీలోనూ సక్రమంగా పనిచేయలేకపోయాడు. దీంతో క్వారీల నిర్వాహకులు పనిలో పెట్టుకోలేదు. ఈ క్రమంలో కొత్తమల్లాయపాలెం నుంచి క్వారీలకు వెళ్లే రోడ్డులోని మార్జిన్‌లో పూటుగా మద్యం సేవించి పడిపోయి ఉండటంతో స్థానికులు ఎస్సైకి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి వచ్చి ఎస్సై పరిశీలించగా అతను మృతి చెందినట్లు తెలుసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

● శిశువు మృతి


బస్సులోనే పురుడు పోసుకున్న మహిళ

పెద్దదోర్నాల: అకస్మాత్తుగా పురిటి నొప్పులు రావటంతో ఓ మహిళ ఆర్టీసీ బస్సులోనే ప్రసవించిన సంఘటన మండల పరిధిలోని యడవల్లి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో తల్లి క్షేమంగా ఉండగా పుట్టిన మగశిశువు మృతి చెందింది. వివరాలు.. త్రిపురాంతకానికి చెందిన ఈభూది సాలమ్మకు కర్నూల్‌ జిల్లా నన్నూరుకు చెందిన శ్రీనుతో వివాహమైంది. సాలమ్మ కాన్పు కోసం కొద్ది రోజుల క్రితం పుట్టింటికి చేరింది. దంపతుల మధ్య వివాదం నేపథ్యంలో సోమవారం త్రిపురాంతకం వచ్చిన భర్త శ్రీను ఆమెతో గొడవ నడినట్లు సమాచారం. కోపంలో భర్త తిరిగి వెళ్లిపోయాడు. భర్త తనపై అలిగాడని భావించిన సాలమ్మ మంగళవారం ఉదయాన్నే ఒంటరిగా కర్నూల్‌ బయల్దేరింది. పెద్దదోర్నాల దాటిన తర్వాత బస్సులో తీవ్ర నొప్పులు వచ్చి కొందరు మహిళా ప్రయాణికుల సాయంతో అక్కడే ప్రసవమైంది. ప్రయాణికులు బస్సును తిరిగి మండల కేంద్రానికి మరలించి సాలమ్మను ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన


ఇంటి ముందు నేలపై కూర్చొని ఆందోళన చేస్తున్న రాజ్యలక్ష్మి

చీరాల: తన భర్త తనకు కావాలి.. న్యాయం చేయాలంటూ వివాహిత భర్త ఇంటిముందు ఆందోళనకు దిగింది. ఈఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని హారీస్‌పేటలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. హారీస్‌పేటకు చెందిన లేళ్ల చైతన్యకు రాజ్యలక్ష్మితో కొంత కాలం క్రితం వివాహమైంది. అయితే గత కొన్ని రోజుల నుంచి తన భర్త చైతన్య తనను వేధించడంతో పాటు అత్తమామల మాటలకు ఒత్తాసు పలుకుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయింది.

అత్తమామల ఆదేశాలతో భర్త తనను ఇంట్లోకి రానివ్వకుండా వేధిస్తుండటంతో గత్యంతరం లేక తన భర్త ఇంటి ముందు ఆందోళన చేస్తున్నానని తెలిపింది. తనకు న్యాయం చేసేంత వరకు ఆందోళన విరమించనని ఇంటి ముందు భీష్మించుకుని కూర్చుంది. సమాచారం అందుకున్న ఒన్‌టౌన్‌ పోలీసులు ఆందోళన చేస్తున్న వివాహిత, ఇరువర్గాల కుటుంబ సభ్యులతో సంప్రదింపులు చేస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.